మునిపల్లిలో ట్రైనీ కలెక్టర్ పర్యటన

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 29 : మండలంలోని మునిపల్లిలో ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి గురువారం పర్యటించారు. నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీడీవో సతీశ్‌కుమార్, డీఎల్పీవో శివకృష్ణ, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, ఏపీవో రవి, ఏపీఎం రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గౌతమి ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29 : టీయూలోని బయో టెక్నాలజీ విభాగంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. వార్షిక పరీక్షలు రాసే విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు తెలిపారు.

టీయూలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29 : టీయూలో ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా కొనసాగుతున్నది. నాల్గో రోజు గురువారం మొదటి మ్యాచ్ వర్సిటీ పీజీ టీమ్‌తో తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ టీం తలపడగా.. వర్సిటీ పీజీ టీం గెలుపొందింది. రెండో మ్యాచ్ మొదటి సెమిఫైనల్‌లో గిరిరాజ్ డిగ్రీ కళాశాలతో కేర్ డిగ్రీ కళాశాల తలపడగా గిరిరాజ్ డిగ్రీ కళాశాల గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకుందని వర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డాక్టర్ బాలకిషన్ తెలిపారు.

బీడీ కార్మికుల నిరసన

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29 : మండల కేంద్రంలో ప్రగతిశీల యూనియన్ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు గురువారం నిరసన చేపట్టారు. బీజేపీ ప్రభుత్వం బీడీ కార్మికుల పొట్ట కొట్టేలా కార్మిక చట్టాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని విద్యార్థులను మోసం చేసిన మోదీ.. రాముడి పేరుతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ.సుప్రియ, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల సొసైటీ ఫలితాల్లో గుడితండా వాసి ప్రతిభ

ధర్పల్లి, ఫిబ్రవరి 29 : మండలంలోని గుడితండాకు చెందిన సబావత్ దేవీదాస్ గురుకుల విద్యాలయ సొసైటీ ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ప్రతిభ కనబర్చి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న దేవీదాస్ గతేడాది ఆగస్టులో నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు సాధించాడు. దేవీదాస్ ఒకటి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివారు. నెట్, సెట్ తదితర అర్హతలు సాధించి హెచ్‌సీయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆయనను గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపికైన నేహాబేగాన్ని సారంగాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు ఎండీ అక్బర్ నవాజుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. అండర్-15 విభాగంలో వరంగల్‌లో ఇటీవల నిర్వహించగా పోటీల్లో నేహాబేగం ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. పంజాబ్‌లో త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నదని, బీదకుటుంబానికి చెందిన ఆమెకు దాతలు సహకరించాలని కోరారు. – సారంగాపూర్, ఫిబ్రవరి 29

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపనలో పూజల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

జిల్లాకేంద్రంలోని వాసవీమాత ఆలయంలో పూజల్లో పాల్గొన్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

రుద్రూర్, ఫిబ్రవరి 29 : మండలకేంద్రంలోని అంగడిబజార్‌లో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రారంభోత్సవ కొనసాగుతున్నాయి. మూడో రోజు గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోచారం శ్రీనివాసరెడ్డి హాజరై విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభం, నంది విగ్రహం ఏర్పాటు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సుమారు కోటి రూపాయల విరాళాలతో ఆలయాన్ని నిర్మించిన ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పోచారాన్ని సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వసంతా సంజీవ్‌రెడ్డి, సభ్యులు భూమయ్య, బాలు, బొట్టె గజేందర్, శ్రీను, భీంరావు, సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాసవీమాత, మార్కండేయ ఆలయాల్లో..

సుభాష్‌నగర్ / ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 29 : నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహా కుంభాభిషేకం, కోటగల్లీలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాజగోపుర కలశ, ధ్వజ, ప్రాణ ప్రతిష్ఠాపనత్సోవాలను గురువారం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బిగాలను సన్మానించారు. బిగాల వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు ఉన్నారు.

చక్రంగుడిలో తిరు కల్యాణం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29 : మాఘ బహుళ పంచమి స్వాతి నక్షత్రం పురస్కరించుకొని బ్రహ్మపురిలోని చక్రంగుడిలో లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణాన్ని గురరువారం ప్రధాన అర్చకుడు నాని స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి కల్యాణం

సారంగాపూర్, ఫిబ్రవరి 29 : రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ)లో ఉన్న శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారి కల్యాణ కన్నుల పండువగానిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని వీక్షించారు. అనంతం భక్తులకు అన్నదానం చేశారు. మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్ వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు, కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కవి సమ్మేళనం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29 : జిల్లాకేంద్రంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. లీప్ సంవత్సరం సందర్భంగా మంచి కవిత్వాన్ని చదువుదాం – మంచి కవిత్వాన్ని విందాం అంశంపై కవి సమ్మేళనం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ తెలిపారు. కవులు కె.సంతోష్‌కుమార్, సుమలతశర్మ, తిరుమల శ్రీనివాస్, సుజాత, పద్మజారెడ్డి, పద్మావతి, సాయిబాబు, సిర్పలింగం, శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని కవితాగానం చేశారు.

ఆలోచింపజేసిన సైన్స్‌ఫేర్లు

ధర్పల్లి/ కోటగిరి, ఫిబ్రవరి 29 : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం నిర్వహించిన సైన్స్‌ఫేర్లు ఆలోచింపజేశాయి. ధర్పల్లి మండలంలోని హంసవాహిని పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌కు టీయూ ప్రొఫెసర్లు సంపత్‌కుమార్, రాంబాబు హాజరై ప్రదర్శనలను పరిశీలించారు. కోటగిరిలోని శ్రీవేద హైస్కూల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ సునీత సైన్స్ ఫేర్‌ను ప్రారంభించి, విద్యార్థులను అభినందించారు.

ఎన్‌సీఎస్ఎఫ్‌ను పునఃప్రారంభించాలి

■ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎన్‌సీఎస్ఎఫ్‌ను పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సారంగాపూర్, ఫిబ్రవరి 29 : రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సారంగాపూర్ సహకార చక్కెర కర్మాగారం (ఎన్‌సీఎస్ఎఫ్)ను పునఃప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని ఆయన గురువారం సందర్శించారు. ఫ్యాక్టరీలో తుప్పు పట్టిన యంత్రాలను పరిశీలించి మాట్లాడారు. తెలంగాణలోని ఏకైక సహకార చక్కెర కర్మాగారం సారంగాపూర్‌లో ఉన్నదని, 2008 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అనుసరించిన విధానాలతో మూసివేయాల్సి వచ్చిందని అన్నారు. రైతులకు అప్పగించినా వారు నడిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఎన్‌సీఎస్ఎఫ్‌ను ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అఖిల భారత చెరుకు విభాగం కన్వీనర్ కొండెల సాయిరెడ్డి కోరారు.

పట్టుదలతో చదవాలి

విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పూర్వవిద్యార్థి మోహన్‌నాయక్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29 : ఖిల్లా డిచ్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఫేర్‌వెల్ పార్టీని బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రత్యేకాధికారిగా పూర్వ విద్యార్థి (1985-86 ఎస్సెస్సీ బ్యాచ్) ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ – హైదరాబాద్ జె.మోహన్‌నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఏర్పర్చుకొని, పట్టుదలతో ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. మోహన్‌నాయక్ పాఠశాల అభివృద్ధి లక్ష రూపాయల విరాళం అందజేశారు. టీయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ కొత్త విషయాలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు, స్పోర్ట్ సామగ్రి అందజేశారు. హెచ్ఎం సీతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

■ **పారిశుద్ధ్య పనుల పరిశీలన** - జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 29 : మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మానందం పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

■ **పరీక్ష అట్టల పంపిణీ** - సిరికొండ, ఫిబ్రవరి 29 : తూంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో టెన్త్ విద్యార్థులకు మాజీ సర్పంచ్ బాలమణీ మల్లేశ్ పరీక్ష అట్టలను గురువారం పంపిణీ చేశారు. హెచ్ఎం రాములు, పీఈటీ నగేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **పోలియో చుక్కలు వేయించాలి** - ఇందల్వాయి, ఫిబ్రవరి 29: ఇందల్వాయి పీహెచ్‌సీ పరిధిలో ఐదేండ్లలోపు చిన్నారులు 7,322 మంది ఉన్నారని, అందరికీ ఈ నెల 3న పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు సంతోష్‌కుమార్, శంకర్ అన్నారు. మండల కేంద్రంలో సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. 4వ తేదీన ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయాలని సూచించారు.

■ **బాడీఫ్రీజర్ అందజేత** - రుద్రూర్, ఫిబ్రవరి29: బొప్పాపూర్ గ్రామపెద్దలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షుడు శ్యాంసుందర్ పహాడే, సభ్యులు బాడీ ఫ్రీజర్ గురువారం అందజేశారు.

■ **నర్సరీ పరిశీలన** - మోస్రా (చందూర్), ఫిబ్రవరి 29 : మోస్రా మండల కేంద్రంలోని నర్సరీని నాయబ్ తహసీల్దార్, ప్రత్యేకాధికారి సాయిలు గురువారం పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

■ **ఉపాధిహామీ నర్సరీ..** -భీమ్‌గల్, ఫిబ్రవరి 29: మండలంలోని బాబానగర్‌లోని ఉపాధిహామీ నర్సరీని ఎంపీడీవో సంతోష్‌కుమార్ గురువారం పరిశీలించారు. గ్రామపంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.

■ **సైకిళ్ల పంపిణీ** -ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 29 : నగరంలోని అభ్యాస పాఠశాలలో రోటరీ క్లబ్ జెమ్స్ – నిజామాబాద్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులకు సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. వెల్‌డన్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సహకారంతో వీటిని పంపిణీ చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.

■ **నువ్వు పంట పరిశీలన** – బాల్కొండ, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని నువ్వు పంటను మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. ఆకుముడుత, గొంగళి పురుగు సోకడంతో పంట ఎదుగుదల ఆగిపోతుందని అన్నారు. దీని నివారణకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రేష్మ, రైతులు పాల్గొన్నారు.

■ **ప్రశాంతంగా పరీక్షలు**- భీమ్‌గల్, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి గురువారం తెలిపారు. మూడు పరీక్ష సెంటర్లలో 527 విద్యార్థులకు గాను 510 మంది హాజరయ్యారని 17 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

■ **ఇంటి పన్ను వసూలు చేయాలి**- రెంజల్, ఫిబ్రవరి 29: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిలను ఈనెల15 నాటికి వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీవో శంకర్ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫిల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఎంపీవో గౌసొద్దీన్, ఏపీవో రమణ, ఈసీ శరత్ ఉన్నారు.

■ **శివాజీకి నివాళి**- ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి29: పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంకాపూర్‌లో ట్రెయినీ కలెక్టర్ పర్యటన

పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

ఆర్మూర్‌టౌన్, ఫబ్రవరి29: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి పర్యటించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఐకేపీ, ఉపాధి హామీ కూలీలతో వివిధ పథకాలపై చర్చించారు. గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు నాటే ప్రక్రియను ఏవిధంగా చేపడుతున్నారో కూలీలను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో సాయిరాం పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త ...ఆత్మహత్యగా చిత్రీకరణ

బాల్కొండ, ఫిబ్రవరి 29: కట్టుకున్న భర్తే కాలయముడై భార్యను గొంతు నులిమి హత్య చేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించి చివరికి కటకటాల్లోకి వెళ్లిన ఘటన బాల్కొండలో వెలుగు చూసింది. మండల కేంద్రంలో బుధవారం అత్తింటి వేధింపులకు బలైన ధర్మాయి లావణ్య మృతిపై గురువారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. 15 ఏండ్ల క్రితం ధర్మాయ రాజేందర్, లావణ్యకు వివాహం జరిగింది. పెళ్లైన యేడాది తర్వాత వారిమధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో అత్తింటివారు లావణ్యపై కేసులు పెట్టారు. ఈ క్రమంలో కేసు మాఫీ చేసేందుకు రాజేందర్ లావణ్య తండ్రి వద్ద నుంచి రూ.2 లక్షలు తీసుకున్నాడు. కోర్టు కేసుల విషయంలో గొడవలు తారాస్థాయికి చేరాయి. తరచూ లావణ్యను భర్త రాజేందర్, అత్త గంగు, మామ లింగన్న, ఆడపడుచు వేధించేవారు. ఈనెల 28న లావణ్య, రాజేందర్ మధ్య గొడవ జరిగింది. చనిపో అంటూ లావణ్యను రాజేందర్ అన్నాడు. లావణ్యతో సూసైడ్ నోట్ రాయించి ఎవరూ లేని సమయంలో ఆమె గొంతుకు టవల్‌ను బిగించి హత్య చేశాడు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రాజేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. లావణ్యను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేసిన భర్త, అత్త, మామ, ఆడపడుచులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై గోపి వెల్లడించారు.

బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీడబ్ల్యూవో, సిబ్బంది

వేల్పూర్, ఫిబ్రవరి 29: మండలంలోని అంక్సాపూర్ గ్రామంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వీవో అధ్యక్షులకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డీడబ్ల్యూవో రసూల్‌బీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన, బాల్య వివాహాలు, డ్రాపౌట్ విద్యార్థులు, హెల్ప్‌లైన్ తదితర అంశాలపై వివరించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. సీడీపీవో జ్ఞానేశ్వరి, ది న్యూ ఇండియా అసురెన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ శ్యాంసుందరి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, సౌమ్య, ఎస్ఎఫ్ఎల్ పుష్ప, హైస్కూల్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు వద్ద మద్యంతాగి యువకుడు మృతి

భీమ్‌గల్, ఫిబ్రవరి 29: మండలంలోని బడాభీమ్‌గల్‌లో బెల్ట్‌షాపు వద్ద మద్యంసేవించిన ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామంలో నెల్లూర్ జిల్లా కొండాపూర్ మండలం గొట్టిగుండాల గ్రామానికి చెందిన వేములపాటి మాధవ(37) తాపీ (మేస్త్రీ) పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటలకు రాకేశ్‌గౌడ్‌కు చెందిన బెల్ట్‌షాపు వద్ద మద్యం తాగి మృతి చెందాడు. ఎస్సై తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా బాధిత కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు..

నవీపేట, ఫిబ్రవరి 29: పాల్దా గ్రామంలో బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పాల్దా గ్రామానికి చెందిన మరియా(60) బుధవారం రాత్రి సమీపంలోని కిరాణా షాపు నుంచి పాలు తీసుకెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చింది. అదేసమయంలో నిజామాబాద్ నుంచి స్వగ్రామం జన్నేపల్లికి బైక్‌పై వస్తున్న నర్సయ్య అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, పిల్లలు లేరు. దీంతో మేనల్లుడు ప్రేమ్ ఇంట్లో ఉంటోంది. ప్రేమ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం మత్తులో వాగులో పడి ఒకరు..

మాక్లూర్, ఫిబ్రవరి29: మండలంలోని వల్లభపూర్ గ్రామానికి చెందిన గొల్ల గంగాధర్ (55) చిక్లీ శివారులోని జన్నేపల్లి పులాంగ్ వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధీర్‌రావు గురువారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన గంగాధర్ మద్యం మత్తులో వాగులో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెతకగా గురువారం ఉదయం వాగులో మృతదేహం కనిపించింది. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య గతంలో మృతి చెందింది. కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిజాంసాగర్ కాలువలో మృతదేహం లభ్యం

కోటగిరి, ఫిబ్రవరి 29: ఎత్తొండ గ్రామశివారులో ఉన్న నిజాంసాగర్ కాలువలో గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 25న చిక్కడ్‌పల్లికి చెందిన హంగర్గ వీరన్న (65) ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. 26న చిక్కడ్‌పల్లి సమీపంలోని నిజాంసాగర్ కాలువ పక్కన ఆయన బట్టలు ఉండడాన్ని కుటుంబీకులు గమనించారు. నిజాంసాగర్ కాలువలో ఆయన మృతదేహం లభించడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

స్త్రీనిధి రుణాలను రికవరీ చేయాలి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29 : స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు అందించిన రుణాలను వంద శాతం రికవరీ చేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి శిబిరంలో స్త్రీనిధి జిల్లాస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో జీఎం కిశోర్, డీపీఎం శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల వీవోఏలు, సీసీలకు రెండు రోజుల పాటు లక్‌పతి దీదీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సభ్యురాలికి ఉపాధి కల్పించి, లక్షాధికారిగా చేసేందుకు ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

మోర్తాడ్, ఫిబ్రవరి29: స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో గురువారం జాతీయసైన్స్ దినోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో ఆంధ్రయ్య బహుమతులను అందజేశారు. హెచ్ఎం వినోద్, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT NIZAMABAD

E.P.No. 23 of 2022

Between:-

Pothagalla Satyanarayana S/o. P.Yellaiah, aged 45 years, Occ: Govt. Employee, R/o. H.no.6-7-96, Hamalwadi, Nizamabad ... DHR

And

Smt. Chinthapandu Laxmi Kusuma Prasanna and others... ...JDR

To,

Navate Vanjari Sharada W/o.Navate Bhumaiah, aged 35 years, Occ:House hold R/o. H.No.6-8-277, Namdevwada, Nizamabad.

Take notice that DHR has filed a EP to for to execute the registered sale deed in favour of DHR on the file of senior Civil Judge, Nizamabad, notices were sent number of times to you, but you have managed to returned it, as such the DHR has taken steps, as a means of substitute service of serving notice on you, please take notice that the matter is posted on 19.03.2024, so please be present either in person or through pleader, failing which, the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT//

Sd/- T.GANGADHAR, D.VENU & P.DILIP

Advocates, Nizamabad - 503 002

Cell: 98491 07614, 83409 96596

తెల్లజొన్న పంట దహనం

ముప్కాల్, ఫిబ్రవరి29: రెంజర్ల-వేంపల్లి గ్రామాల మధ్య రోడ్డుపైన ఆరబెట్టిన తెల్లజొన్న పంటను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పంటించి కాల్చివేశారు. రెంజర్లకు చెందిన శివాయి చిన్న నర్సయ్యకు చెందిన ఈపంటతోపాటు రెండు టార్పలిన్లు కూడా కాలిపోయాయని, దాదాపు రూ.30వేల వరకు నష్టం కలిగిందని, ప్రభుత్వం ఆదుకోవ